

శిథిలావస్థలో ఉన్న ఫిట్టర్, మెషినిస్టు తరగతి గదులు




అద్దె భవనంలో అరకొరవసతుల మధ్య నడుస్తున్న మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ

- ఉమ్మడి జిల్లాలో ఆరు ఐటీఐ ప్రాంగణాలు
- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు
- కాంగ్రెస్ సర్కారూ పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు



పూర్తిగా పాతబడి పోయిన వరంగల్ ఐటీఐ భవనం



అవస్థల మధ్య అంతంతమాత్రంగా!

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు

పాతబడిన భవనాలు.. ఎగిరిపోయి, కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల కప్పులు.. వాటిలో పాత కాలం నాటి యంత్రాలు.. కనిపించని కనీస వసతులు.. ఇవీ ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల్లో కనిపిస్తున్న దుర్భర పరిస్థితులు. అయిదారు దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనాలు కావడంతో అధ్వానంగా.. చూడడానికి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. విద్యార్థులకు వివిధ వృత్తుల్లో సాంకేతిక శిక్షణనిచ్చి ఉపాధి కల్పించడానికి ఉద్దేశించిన ఉమ్మడిజిల్లాలో నిర్మించిన ఆరు ఐటీఐలు మారుతున్న కాలానికి అనుగుణంగా లేకపోవడం, నిధులు లేమి, ఫలితంగా రా మెటీరియల్ సరఫరా లేకపోవడం, టెక్నికల్ స్టాఫ్ సరిపడా లేకపోవడం పెద్ద సమస్యగా మారాయి. ఫలితంగా సరైన శిక్షణ పొందలేక.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి, ఉద్యోగావకాశాలను అంది అందిపుచ్చుకోవడంలో విద్యార్థులు వెనుకబడుతున్నారన్న వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ఓ వైపు వృత్తి విద్యను ప్రోత్సహించాలని చెబుతూనే మరో వైపు అదే వృత్తి విద్యను నేర్పే ఐటీఐలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు ఎలాంటి నిధులు రాకపోవడంతో ఐటీఐ ప్రాంగణాల నిర్వహణ పూర్తిగా డీలా పడిపోయిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా ఏ మాత్రం పట్టింపు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు : 7 లో..

సమస్యలతో ప్రజలు..

సెల్‌ఫోన్లలో అధికారులు

ప్రజావాణి కార్యక్రమంలో యంత్రాంగం తీరు



ప్రజావాణిలో ఫోన్లలో నిమగ్నమైన అధికారులు

జనగామ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం పట్ల అధికారులు ఏ మాత్రం పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఓవైపు ప్రజలు తమ గోడు వెల్లబోసుకుంటుంటే అధికారులు మాత్రం ఫోన్లలో బిజీబిజీగా ఉండిపోయారు. సోమవారం దరఖాస్తులు ఇచ్చేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చారు. వారి నుంచి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ దరఖాస్తులను స్వీకరిస్తూ సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేశారు. కాగా, ప్రజావాణి జరుగుతున్న సమయంలో ప్రజల సమస్యలపై దృష్టి సారించాల్సిన అధికారులు ఫోన్లలో నిమగ్నమయ్యారు. ఫేస్‌బుక్‌లో పోస్టులు చూస్తూ ఒకరు, యూట్యూబ్‌లో వీడియోలో చూస్తూ మరొకరు టైంపాస్ చేయడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

వివిధ సమస్యలపై 90 ఆర్జీలు ఇచ్చిన ప్రజలు

వివరాలు 8వ పేజీలో...

నూతన చట్టాలతో సత్వర న్యాయం

- కేసుల విచారణలో జాప్యం ఉండదు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 1 : నూతన చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, కేసుల విషయంలో జాప్యం ఉండదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులకు సోమవారం నుంచి అమలవుతున్న నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాల అమలు తీరుపై కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిపుణుల కమిటీ సుదీర్ఘంగా చర్చించి బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో నూతన చట్టాలకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. సోమవారం నుంచి నూతన చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. నూతన చట్టాల అమలుతో కేసుల విచారణలో జాప్యం ఉండదని, పారదర్శకంగా విచారణ ఉంటుందని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. నేరం చేసిన వారు కేసుల నుంచి తప్పించుకోలేరని ఆయన అన్నారు. నేరం ఎక్కడ జరిగినా బాధితులు ఏ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని విచారణ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు మూడు రోజుల్లో సంబంధిత స్టేషన్‌కు వెళ్లి సంతకం చేసి ఎఫ్ఐఆర్ పొందవచ్చన్నారు. గత నెలాఖరు వరకు పాత చట్టాల ప్రకారంగా నమోదైన కేసుల విచారణ నూతన చట్టాల ఆధారంగా జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో 50శాతం మహిళలు, పిల్లలపై జరుగుతున్నవేనన్నారు. వీటిని నియంత్రించేందుకు నూతన చట్టాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కఠిన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. నూతన చట్టాలపై అన్ని వర్గాలకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతీరోజు పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఏదైనా సమస్య ఉన్నప్పుడు బాధితులు 87126 85070 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి ఆయా స్టేషన్‌ల సిబ్బంది న్యాయం చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్‌లలో న్యాయం జరుగకుంటే ఏసీపీని కలువాలని అక్కడ న్యాయం జరుగకుంటే నేరుగా తనను కలువవచ్చని అంబర్ కిషోర్ ఝా వివరించారు. అవగాహన కార్యక్రమంలో ఏసీపీలు జితెందర్‌రెడ్డి, డేవిడ్‌రాజ్, సీఐలు పుల్యాల కిషన్, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జనగామ ఏసీపీ అంకిత్‌కుమార్ బదిలీ

భద్రాచలం ఏఎస్పీగా పోస్టింగ్



అంకిత్‌కుమార్ శంఖ్వార్

జనగామ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జనగామ ఏసీపీగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి అంకిత్‌కుమార్ శంఖ్వార్ బదిలీ అయ్యారు. ఆయనకు భద్రాచలం ఏఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎస్పీ హోదాలో గ్రేహౌండ్స్ కమాండర్‌గా ఉన్న 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అంకిత్‌కుమార్‌ను పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం జనగామ ఏసీపీగా నియమించింది. ఏప్రిల్ 3న ఆయన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. కేవలం మూడు నెలలు ఆయన ఇక్కడ ఏసీపీగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన భద్రాచలం ఏఎస్పీగా బదిలీ అయ్యారు. కాగా.. ఆయన స్థానంలో ఇంకా ఎవరికీ బాధ్యతలు ఇవ్వలేదు.

దేవుడి ఆశీస్సులతో విజయం సాధించాం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

శ్రీభవానీ శంకర ఆలయంలో విశిష్ట పూజలు

జఫర్‌గఢ్, జూలై 1: దేవుడి ఆశీస్సులు, ప్రజల సహకారంతో తాను, తన కుమార్తె కావ్య ఎన్నికల్లో విజయం సాధించామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం ఆయన జఫర్‌గఢ్ మండలం తిడుగు గ్రామంలోగల శ్రీభవాని శంకర ఆలయంలో పూజలు చేశారు. పంచమ వార్షిక మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన విశిష్ట పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గర్భగుడిలోని స్ఫటిక శివలింగానికి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ దేవుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, సుభిక్షంగా జీవించేలా చూడాలని కోరుకున్నానన్నారు. తాను ఎలాంటి అక్రమాలకు తావీయకుండా నిజాయితీగా పని చేస్తానని భగవంతుని సన్నిధిలో హామీ ఇస్తున్నానని అన్నారు. తిడుగు నుంచి మండల కేంద్రానికి, వరంగల్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నందున.. గర్మిళ్లపల్లి - తిడుగు మీదుగా సాగరం ప్రధాన రహదారి వరకు ఏడాదిలోగా డబుల్ బీటీ రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో పేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.



ఆలయంలో కొనసాగుతున్న పూజా కార్యక్రమాలు, పాల్గొన్న భక్తులు

వైభవంగా మహాచండీ యాగం..

పంచమ వార్షికోత్సవంలో భాగంగా శ్రీభవాని శంకర ఆలయంలో ఆలయ నిర్మాణ దాత బజ్జూరి కృష్ణమూర్తి - పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో మహాచండీ యాగం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాన్నదానం నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ సుదర్శన్, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపీటీసీ మాదారపు రజిత యాకయ్య, మాజీ సర్పంచ్‌లు నల్లతీగల మణెమ్మ బాషా, చందా స్వప్న భాస్కర్, బండి యాదగిరి, గోపు సోమయ్య, హరిప్రసాద్, నవీన్‌కుమార్, సుధాకర్, రంగు సురేశ్, సదానందం, రాజు, నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోంది

జనగామ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

ఎమ్మెల్యే పల్లా ఆరెస్టుకు నిరసనగా రాస్తారోకో



జనగామలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

జనగామ రూరల్, జూలై 1: రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగోతుందని, నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని జనగామ మార్కెట్ మాజీ చైర్మన్, జనగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకల జమున అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరెస్టును ఖండిస్తూ జనగామ బీఆర్‌యస్ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై సికింద్రబాద్ గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ నాయక్‌ను పరామర్శించేందుకు వెళ్లిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమన్నారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మారబోయిన పాండు, దయాకర్, దేవరాయల నాగరాజు, పేర్ని స్వరూప, నాయకులు పసూల ఏబెల్, బైరగోని యాదగిరి గౌడ్, రావెల రవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

డాక్టర్స్‌డే వేడుకల్లో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

జిల్లావ్యాప్తంగా వైద్యులకు ఘనసన్మానం

జనగామ కల్చరల్, జులై 1: అన్ని వృత్తుల కంటే డాక్టర్ వృత్తి పవిత్రమైనదని డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. సోమవారం డాక్టర్స్ డే ను పురస్కరించుకొని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బందిని, ఆరోగ్య కేంద్రాల డాక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డాక్టర్లు అంకితభావంతో పని చేయాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నరేందర్, శ్రీదేవి, సుధీర్, కరుణాకర్‌రాజు, అశోక్, భాస్కర్, రవితేజ, హసన్, ప్రవీణ్, కార్యాలయ సిబ్బంది ఎం.ప్రభాకర్, జయపాల్‌రెడ్డి, హేమ నాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్లను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం ఆధ్వర్యంలో ...

లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలో క్లబ్ అధ్యక్షుగు గాదె నర్సింహులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్లను శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధి రంగరాజు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో డాక్టర్ల పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. డాక్టర్లను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం వైద్యులు గౌతమ్‌రెడ్డి, అంజిరెడ్డి, తనూజ, మౌనికను సన్మానించారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో 60 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెర్రి వేణుగోపాల్‌రెడ్డి, బండ భిక్షపతి, ఏనుగు నర్సిరెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, ఎలికట్టె నరేందర్, మేడ పూర్ణచందర్, దాసరి సుమన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత కారుకు నిప్పు

అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య



మంటల్లో కాలిపోతున్న కారు

వివరాలు 8లో..

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన జ్యోతి

తమ భూమిని కబ్జా చేశారని ఆరోపణ

ఒంటిపై పెట్రోల్ పోసుకొని బలవన్మరణానికి ప్రయత్నం

జనగామ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తమకు చెందిన భూమిలో వేరొక వ్యక్తి కబ్జాలో ఉంటున్నాడని ఆరోపిస్తూ జనగామ కలెక్టరేట్‌లో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటి వద్ద 10, 15 జ్వరం మాత్రలు వేసుకొని వచ్చి ప్రజావాణి జరుగుతున్న కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. దీంతో పరిస్థితి కొద్దిసేపు ఉద్రిక్తంగా మారింది. తన ఇద్దరు పిల్లలతో కలిసి జనగామ కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అక్కడే విధుల్లో ఉన్న ఏఎస్సై మనోహర్ మహిళ చేతిలో నుంచి బాటిల్ లాక్కున్నారు. మహిళ అప్పటికే ఇంటి వద్ద డోలో మాత్రలు వేసుకొని వచ్చిందని తెలుసుకున్న పోలీసులు ఆమెను జనగామ ఆసుపత్రికి తరలించారు. జనగామ జిల్లా నర్మెట మండలకేంద్రానికి చెందిన బాధిత మహిళ దేవులపల్లి జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. దేవులపల్లి జ్యోతి, ఆమె చెల్లెలు స్వప్నకు నర్మెటలో 1.04 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని వారి తాత దేవులపల్లి లక్ష్మయ్య ఇద్దరు మనవరాళ్ల పేరు మీద 22 గుంటల చొప్పున తాను గార్డియన్‌గా ఉంటూ గతంలో రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ భూమిని జ్యోతి, స్వప్న తండ్రి శ్రీహరి 2007లో నర్మెటకు చెందిన జంగిటి అంజయ్యకు విక్రయించారు. కాని రిజిస్ట్రేషన్ చేయలేదు. అయినా అంజయ్య ఆ భూమిని కాస్తు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో తమకు తెలియకుండా తమ తండ్రి అమ్మారని, ఇది చెల్లదంటూ జ్యోతి, స్వప్న కొంతకాలంగా విభేదిస్తూ వస్తున్నారు. తమ తాత తమకు రిజిస్ట్రేషన్ చేశాడని, అందువల్ల తమకే చెందుతుందని వాదిస్తున్నారు. ఈ క్రమంలో ఆ భూమిలోకి వెళ్తే అంజయ్య అడ్డుకున్నారు. దీనిపై గతంలో నర్మెట పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో విసుగుచెంది ఆత్మహత్యకు యత్నించింది.

ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని జ్యోతి కోరింది. కాగా.. ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను జనగామ ఏరియా ఆసుపత్రిలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

వారంలో రెండో ఘటన

జనగామ కలెక్టరేట్‌లో భూ వివాదాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడడం వారంలో ఇది రెండో ఘటన. కలెక్టరేట్‌లో గత సోమవారం ప్రజావాణి సందర్భంగా జనగామ మండలం పసరమడ్లకు చెందిన నిమ్మల నర్సింగరావు తమ భూమిని ఇతరులకు పట్టా చేశారంటూ కలెక్టరేట్ బిల్డింగ్ ఎక్కి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మరవకముందే సోమవారం మహిళ ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది.

సందడిగా కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

జిల్లా వ్యాప్తంగా 240 బాలబాలికల హాజరు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 1 : వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో వరంగల్ జిల్లా స్థాయి బాలబాలికల (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం జేఎన్‌ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌పై అండర్ 8, 10, 12 బాలబాలికల విభాగాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మండల కేంద్రాల నుంచి 240 బాలబాలికలు పాల్గొనడం జరిగిందన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 15 మంది బాల బాలికల ను ఈ నెల 7న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని గోపీచంద్ అకాడమిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఫైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, పీఈటీలు కృష్ణమూర్తి, మహేందర్, శ్రీలత, శ్రీనాథ్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

చిందు కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు

గడ్డం సమ్మయ్యకు అభినందన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దేవరుప్పుల, జూలై 1: అర్హులైన చిందు కళాకారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యకు స్వగ్రామంలో అభినందన సభ జరుగగా శ్రీహరితో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సమ్మయ్య తాతల కాలం నుంచి చిందు వృత్తితోనే జీవనం సాగించేవారని, సమ్మయ్య కూడా అదే వృత్తిని కొనసాగిస్తూ కళలను పదిమందికి ఉపయేగపడే విధంగా కృషి చేశారని అన్నారు. ఆయన కృషికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి పద్మశ్రీ ఇచ్చారని గుర్తు చేశారు.

చిందు కళాకారులతో పాటు మాదిగ ఉపకులాలకు ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ అవార్డు పొందడం పాలకుర్తికే గర్వకారణమన్నారు. సమ్మయ్య కుటుంబంతో పాటు చిందు కళాకారులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకునే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన గడ్డలో సమ్మయ్య జన్మించడం, చిందు కళలకు ఆజ్యం పోయడం, పద్మశ్రీ అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ పొందడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ప్రభుత్వం తరుపున సమ్మయ్యతో పాటు చిందు కళాకారులను ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వారు సమ్మయ్యను పూలమాలలు, షాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డం మోహన్‌రావు, వంశీధర్‌రెడ్డి, శివకుమార్, రాంబాబు, నల్ల శ్రీరామ్, పులిగిళ్ల సుధాకర్, కందగట్ల సత్తయ్య, గడ్డం వెంకన్న, ఒగ్గు రవి, అందె భాస్కర్, రాజ్‌కుమార్‌నాయక్, గుర్రం సీతారామ్, లక్ష్మీనారాయణ నాయక్, మాచర్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి

సీపీఆర్‌పై పోస్టల్ కవర్ విడుదల

డాక్టర్ రామక శ్రీనివాస్ కృషితో రూపకల్పన



డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న పోస్టుమాస్టర్ జనరల్ శ్రీలత

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని చారిత్రాత్మకమైన పోస్టాఫీసులో సీపీఆర్ ప్రక్రియ పోస్టల్ కవర్‌ను హైదరాబాద్ జోన్ పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత విడుదల చేశారు. అకస్మాత్తుగా గుండె పోటు వచ్చిన అత్యవసర సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్స కార్డియో పల్మనరీ పునరుజ్జీవనం (సీపీఆర్)పై గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న హనుమకొండకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రామక శ్రీనివాస్ తపాలశాఖ సహకారంతో ఈ పోస్టల్ కవర్‌ను తయారు చేయించారు. సీపీఆర్‌పై తగిన ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పోస్టల్ కవర్‌ను తపాలా శాఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ చాలా కాలంగా సీపీఆర్ పట్ల అవగాహన కల్పించేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ జీవన్ కుమార్ డాక్టర్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆయన పొందిన పురస్కారాలను, సేవాభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ సుబ్రమణ్యం, పోస్టల్ యూనియన్ నాయుడు సీహెచ్ ప్రతాపరెడ్డి, సీనియర్ మెడికల్ రిప్రంజేటివ్, మెడికల్ కౌన్సిలర్ పి భరత్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (రిటర్డ్) వి. రామచంద్రారెడ్డి ఇతర పోస్టాను సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచి రాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు సోమవారం తెలిపారు. డీబారైన వారిలో సికింద్రాబాద్ యూనివర్సిటీ పీజీ కళాశాల ఓయూలో ఇద్దరూ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


అక్షయ్‌రామ్ వర్ష

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్‌లోని వాదన నగర్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత ప్రేరణ శిక్షణకు పంథిని జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న కర్ణకంటి అక్షయ్‌రామ్, కాజీపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గండి వర్ష ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్

ఏటూరునాగారం రూరల్, జూలై1: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ కార్యక్రమం జరిగింది. వివిధ సమస్యలతో వచ్చిన గిరిజనుల వద్ద నుంచి పీవో చిత్రా మిశ్రా వినతులు స్వీకరించారు. మొత్తం 66 మంది గిరిజనుల తమ సమస్యల ను పీవోకు విన్నవించారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీట్ కేటాయించాలని కన్నాయిగూడెం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన చింత రుషి వినతి పత్రం అందించారు. సీఆర్‌టీగా ఉద్యోగావకాశం కల్పించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మి భాగ్య కోరారు. అనారోగ్యా కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని వెంకటాపురం మండలానికి చెందిన వర్షిణి విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఓఎంగా ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయికి చెందిన దుగ్గిరాల శ్రీలేఖ వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 141, 142లోని భూమికి పట్టాలివ్వాలని ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన తాటి నీలాద్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదర స్వామి, ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఇన్‌-చార్జ్ డైరెక్టర్‌గా మధుసూదన్ బాధ్యతల స్వీకరణ


మధుసూదన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

హనుమకొండ టౌన్, జూలై 1 : ఎన్పీడీసీఎల్ ఇంచార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా మధుసూదన్ సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వి. మోహన్‌రావు జూన్ 30 న పదవి విరమణ పొందడంతో హెచ్‌ఆర్‌డి సీజీయంగా విధులు నిర్వర్తిస్తున్న టి. మధుసూదన్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌ను ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలు రైళ్లు దారిమళ్లింపు

కాజీపేట, జూలై 1 - బల్లార్షా సెక్షన్‌లో మూడో లైన్‌ల నిర్మాణపనుల కారణంగా ఈ నెల 3 నుంచి పలు రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిజామాబాద్, బల్లార్షా మీదుగా దారి మళ్లించి నడుపుతున్నారు. గోరఖ్‌పూర్ - యశ్వంతాపూర్‌ల మధ్య నడిచే యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ మక్తల్, నిజామాబాద్‌ల మీదుగా, దారి మళ్లించినడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అవస్థల మధ్య అంతంతమాత్రంగా!

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు



వరంగల్ ఐటీఐలో అధ్వానంగా విద్యార్థుల టాయిలెట్లు



వరంగల్ ఐటీఐలో డ్రాఫ్ట్సుమెన్ తరగతుల భవనం దుస్థితిదీ..

- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు ఆరే ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో మూడు, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారంలో మరో మూడు నడుస్తున్నాయి. జనగామ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ లేదు. ఏటూరునా గరం ఐటీఐ ప్రధానంగా స్థానికంగా ఉన్న ఎస్టీలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసింది. ఈ ఐటీఐల్లో ప్రవేశాల్లో ఎస్టీలకు 80 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఐటీఐలు 21 వరకు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలపై మొత్తం అజమాయిషీ ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రేనింగ్ (డేట్) అనే సంస్థదే. ఐటీఐల్లో ఇచ్చే పారిశ్రామిక శిక్షణకు సంబంధించిన సిలబస్‌ను ఈ సంస్థే తయారు చేస్తుంది. ఈ సంస్థ రూపొందించిన ట్రెయినింగ్ మ్యాన్యువల్‌నే వీటిలో అమలు చేస్తారు. కాగా ప్రభుత్వ ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రం వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలను, సామగ్రిని సమకూర్చాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వమే. ప్రభుత్వ ఐటీఐల్లో పది రకాల ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తుండగా ప్రైవేటు ఐటీలు మాత్రం కేవలం ఒకటీ, రెండు ట్రేడ్‌లనే నిర్వహిస్తున్నాయి. వాటిలో ఎలక్ట్రీషియన్ తప్పని సరి. ఈ ఐటీలలో ఒక సంవత్సరం కోర్సు, రెండు సంవత్సరాల కోర్సులున్నాయి. ఎలక్ట్రీషియన్ రెండు సంవత్సరాల కోర్సు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా) ఏడాది కోర్సు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీల్లో ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుంది.

అందని రా మెటీరియల్ డబ్బులు.. పాతయంత్రాలతోనే కుస్తీ..

ఐటీఐల్లో చదువుకునే విద్యార్థులకు ఆయా ట్రేడ్‌లలో పొందుతున్న శిక్షణకు గాను రా మెటీరియల్‌పైనే ప్రతీ నెల రూ.400 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయాలి. ఒక సంవత్సరం కోర్సు చదివే విద్యార్థికైతే సంవత్సరానికి రూ.4800, రెండు సంవత్సరాల కోర్సు విద్యార్థికి రూ.9600 ఖర్చు చేయాలి. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. కానీ పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. కేవలం ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు మాత్రమే వస్తున్నాయి. చాలా ఐటీఐల్లో పాత యంత్రాలే ఉన్నాయి. బడ్జెట్ లేకపోవడంతో కొత్త యంత్రాలను కొనే పరిస్థితి లేదు. ఈ పాత యంత్రాలతోనే విద్యార్థులు కుస్తీ పడుతున్నారు. వీటిపైనే ప్రయోగాలు చేస్తున్నారు. రా మెటీరియల్ రాకపోవడం వల్ల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. పాత మెటీరియల్స్‌తోనే మళ్లీమళ్లీ చేయాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక ఫిట్టర్ విద్యార్థి ఇనుము మెటీరియల్ సరఫరా లేక గత విద్యార్థులు చేసిన ఇనుప ముక్కలతోనే మళ్లీ చేస్తున్నారు. అలాగే ఎలక్ట్రీషియన్ విద్యార్థి విద్యుత్ వైర్ల సరఫరా లేక పాత వైర్లతోనే సర్దుకోవలసి వస్తోంది. వెల్డింగ్ ట్రేడ్ విద్యార్థులు ఏడాదిలో 50 ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. మెటీరియల్ లేక పది, పదిహేను ప్రాక్టిల్స్‌తోనే సరిపెట్టుకోవలసి వస్తోంది. ఐటీఐల నిర్వహణ ఖర్చులను కూడా రాష్ట ప్రభుత్వం ఇవ్వడం లేదు. సరిగా బడ్జెట్ రాకపోవడం వల్ల ప్రతీ నెల విద్యుత్ బిల్లులను చెల్లించడం కూడా ఐటీఐలకు కష్టంగా మారింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రభుత్వ ఐటీఐల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. గత పదేళ్ల కాలంలో అనేక మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగేలేదు. కేవలం 40శాతం సిబ్బందితోనే ఐటీఐలు నడుస్తున్నాయి. ఇటీవల వీఆర్‌వోలు, వీఆర్‌ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా ఐటీఐలలో నియమించినా పెద్దగా ప్రయోజనం లేకుం డా పోయింది. వారికి వృత్తి శిక్షణకు సంబంధించిన కనీస పరిజ్ఞానం కూడా లేదు. గ్రామాల్లో మస్కూరు పని చేసే వీరికి సాంకేతికపరమైన వృత్తిశిక్షణపైగానీ, కనీసం ఆఫీసులో రికార్డుల నిర్వహణలోగానీ అవగా హన లేకపోవడం వల్ల వారు ఉన్నా ప్రయోజనం లేని పరిస్థితి ఉంది. ఒక్కో ఐటీఐకి ఇద్దరు, ముగ్గురిని నియ మించడంతో ఐటీఐల్లో సిబ్బంది ఉన్నట్టుపైకి కనిపిస్తు న్నది కానీ క్షేత్ర స్థాయిలో అంతాలోటే. ఇక ఐటీఐల్లో వృత్తిశిక్షణలో కీలకమైన టెక్నికల్ స్టాఫ్ మరీ తక్కువ గా ఉన్నారు. అన్ని ఐటీఐలలో 60 శాతానికిపైగా ఖాళీ లున్నాయి. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందు ఎప్పుడో పన్నేండేళ్ల క్రితం ఏపీపీ ఎస్సీ ద్వారా జరిగిన నియామకాలే తప్ప ఆ తర్వాత కాలంలో ఖాళీల భర్తీయే జరగలేదు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటి వరకు ఎలాంటి నియామకాలు జరగలేదు. ఇటీవలే కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రం రెగ్యులరైజ్ చేశారు. ఇదొక్కటే ఐటీఐలో జరిగిన చెప్పుకోదగిన పరిణామం. ఐటీఐలో ఒక్కో యూనిట్ (ట్రేడ్)లో 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అలా ఎన్ని ట్రేడ్‌లు ఉంటే 20 మంది చొప్పున అంత మంది విద్యార్థులను తీసుకుంటారు. నిబంధనల ప్రకారం ఒక్కో ట్రేడ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్ తప్పని సరిగా ఉండాలి. కానీ ఇన్‌స్ట్రక్టర్ల కొరత వల్ల ఉన్న వాళ్లే ఒక్కొక్కరు రెండు, మూడు ట్రేడ్లను చూసుకోవాల్సి వస్తోంది.

కానరాని కనీస సౌకర్యాలు

ప్రభుత్వ ఐటీఐల్లో కనీస సౌకర్యాలు భూతద్దం వేసి చూసినా కానరావు. ఐటీఐలకు ప్రస్తుతం ఉన్న భవనాలు 70, 80 ఏళ్లనాటివి. అవి పూర్తిగా పాతపడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ములుగు రోడ్డులోని ఐటీఐలోని భవనాలు, వర్క్‌షెడ్లు పూర్తిగా పాతపడిపోయి కనిపిస్తాయి. మూత్ర, శాలలు, మరుగుదొడ్లు కూడా సరిగా లేవు. తాగునీటి సదుపాయం అసలు లేదు. అరకొర వసతుల మధ్య వృత్తిశిక్షణ పొందుతున్న విద్యార్థులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. మహబూబాబాద్ ఐటీఐ భవనం పూర్తిగా పాతపడడంతో దాని స్థానం కొత్త భవనం నిర్మించగా జిల్లా పోలీసు అధికారులు లాక్కొని అందులో ఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చేసేది లేక ఐటీఐను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. భూపాలపల్లిలో ఐటీఐ కోసం కట్టిన కొత్త భవనంలో తొలుత కలెక్టరేట్ ఏర్పాటు చేయగా కలెక్టరేట్ భవనం పూర్తికావడంతో ఇటీవలే దానిని ఐటీఐకి తిరిగి అప్పగించారు.

జనగామలో ఎప్పుడు?

ఉమ్మడి వరంగల్‌లోని అయిదు జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా జనగామ జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. ఈ జిల్లాకు ప్రభుత్వ ఐటీఐ ఇది వరకే మంజూరైంది. ఐటీఐ భవన నిర్మాణానికి సిద్ధిపేట రోడ్డులోని గుట్టల సమీపంలో స్థలాన్ని కూడా కేటాయించారు. సర్వే కూడా పూర్తయింది. ఆ తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, స్థానిక ప్రజాప్రతి నిధులు ఒత్తిడి తీసుకురాకపోవడంతో జనగామలో ఐటీఐ ఏర్పాటు ఎక్కడవేసిన గొంగలి అక్కడే చందంగా మారింది. దీనితో విద్యార్థులు ప్రైవేటు ఐటీఐలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా తీసుకొని ప్రైవేటు ఐటీఐలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వేలాది రూపాయలను గుంజుతున్నాయి.

ఒకే క్యాంపస్‌లో..

ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ క్యాంపస్ విశాలంగా ఉంటుంది. 70 ఏళ్ల క్రితం ఈ ఐటీఐ ఏర్పాటైంది. దీనికి విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉన్నది. ఈ ఐటీఐకి విశాలమైన స్థలం ఉండటంతో.. ఇదే అవకాశంగా అన్ని కార్యాలయాలను ఇందులోనే ఏర్పాటు చేశారు. హనుమకొండ ఐటీఐని కూడా ఇందులోకే మార్చారు. ఇది వరకు ఇది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో అద్దె భవనంలో నడిచేది. దానిని ఈ ములుగు రోడ్డులోని ఐటీకి క్యాంపస్‌కు తరలించారు. ఐటీఐల రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఇది చాలదన్నట్టు వరంగల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును, దీంతో పాటు రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును సైతం ఇందులోనే చేటిచ్చారు. పట్టించుకునేవారు లేకపోవడంతో ములుగు రోడ్డులోని ఐటీఐ స్థలంలో కొంత భాగం అన్యాక్రాంతమైంది. విచిత్రమేమిటంటే ప్రస్తుతం పాత సెంట్రల్ జైలు స్థలంలో నిర్మాణంలో ఉన్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బహుళ అంతస్తుల భవన స్థలంలో కొంత ఇందులోనే చూపారు.

ఏటీసీలు సరే.. ఐటీఐల్లోని సమస్యల సంగతేంటి?

ప్రభుత్వ ఐటీఐలు అనేక సమస్యల మధ్య కొట్టు మిట్టాడుతున్న నేపథ్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంలో వీటిల్లో అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్ (ఏటీసీ)లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటీసీలు ఐటీఐలో ఒక భాగంగానే నడుస్తాయి కానీ ప్రస్తుతం ఉన్న పాత ఐటీఐ పరిస్థితేంటన్నది ప్రశ్న. ఏటీసీలు మాత్రమే టీటీఎల్ ఆధ్వర్యంలో నడుస్తాయి. ఐటీఐలు మాత్రం యథావిధిగా ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగుతాయి. ఏటీసీలు ఏర్పాటయితే ప్రస్తుతం ఐటీఐల్లో నిర్వహిస్తున్న ట్రేడ్ల సంగతేమిటన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, డిజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్టుమెన్ సివిల్, టర్నర్, మెషినిస్టు, కోపా ట్రేడ్లను నిర్వహిస్తున్నారు. వీటి కొనసాగింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఐటీఐ ఆవరణలో ఏటీసీల నిర్వహణకు కొత్త భవనాల నిర్మాణం జరుగుతుంది. కానీ ఐటీఐ ప్రస్తుత పాత భవనాల సంగతేమిటీ? విద్యార్థులకు రామెటీరియల్ డబ్బులు ఇచ్చేది ఎవరు? సిబ్బంది ఖాళీల భర్తీ జరిగేనా? మౌలిక వసతుల కల్పన మాటేమిటీ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటీసీల ఏర్పాటుతో పాటు సమాంతరంగా ఐటీఐలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఏటీసీల ఏర్పాటుతో ఒరిగే ప్రయోజనం పెద్దగా ఏమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతన్నకు మద్దతుగా..

వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు పెంచిన కేంద్రం



ఘన్‌పూర్ మార్కెట్‌కు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 1: రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. పెరిగిన ధరలు ఈ సీజన్ నుంచే అమలులోకి వచ్చాయని చెబుతున్నారు. ఏ పంట ధర ఎంత పెరిగింది? మార్కెట్ యార్డులో ఏ సరుకుకు ట్రేడర్లు ఎంత ధర ఇస్తున్నారు? అనేది ఈ ధరలతో రైతులు పోల్చుకుంటే నష్టపోకుండా ఉండవచ్చు. ఒక్కోసారి కొన్ని పంటలకు మద్దతు ధరల కంటే డిమాండ్‌ను బట్టి ఎక్కువ ధర కూడా లభించే అవకాశం ఉంటుంది. మద్దతు ధరలపై రైతులకు అవగాహన ఉంటే లాభపడే అవకాశం ఉంటుంది. ఐతే గత ఏడాది ధరలతో ఈ ఏడాది పెంచిన ధరలను.. పెరిగి పోతున్న పెట్టుబడి వ్యయంతో పోల్చి చూసుకుంటే పెద్దగా ఒరిగిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఎంతైనా గుడ్డిలో మెల్లలా కొంత మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం, ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు, కలుపు తీయడం, పంట కోత కోయించడం, తూర్పార పట్టించడం, మార్కెట్ యార్డుకు రవాణా చేయడం అన్నీ లెక్కలు వేసి చూసుకుంటే చివరకు ఏం మిగలడం లేదని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించిన రైతుకు లాభం మాటేమోగాని కూలీ గిట్టుబాటు కాని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడికి, చేసిన అప్పులకు పోగా రోజుకు వంద, రెండు వందలు కూడా రైతుకు కూలి పడడం లేదని వాపోతున్నారు.

పంట పెట్టుబడి ఇలా..

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు వాటిని పండించడానికి పెడుతున్న పెట్టుబడి, వస్తున్న ఆదాయం లెక్క వేసి చూస్తే పెద్దగా ఫలితం ఉండడం లేదని తెలుస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు వస్తున్న ఆదాయం ఏ మాత్రం చెప్పుకోదగినదిగా ఉండడం లేదంటున్నారు. వరి పంటకు ఎకరాకు పెట్టుబడి 20 నుంచి 25 వేల రూపాయల వరకు అవుతోందని, ట్రాక్టర్‌తో దున్నడానికి రూ.5 వేలు, విత్తనాలు వేయడానికి రూ.5 వేలు, కలుపు తీయడానికి రూ.3 వేలు, ఎరువులు, పురుగు మందులకు 3 వేలు, కోత కోయడానికి రూ.5 వేలు, రవాణ తదితర ఖర్చులు కలుపుకుని తడిసి మోపెడు అవుతోందని రైతులు వాపోతున్నారు. కాగా ఎకరాకు 30 నుంచి 40 బస్తాల ధాన్యం లేదా 20 నుంచి 22 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని, ధాన్యం ధర క్వింటాల్‌కు కనీస మద్ధతు ధర రూ. 2300 వేసుకున్నా 46 వేల నుంచి 50 వేల రూపాయలు వస్తున్నాయి. పెట్టుబడి పోను ఆరు నెలలు కష్టపడితే రూ. 20 వేల నుంచి 25 వేలు మాత్రమే మిగులుతన్నాయని చెబుతున్నారు. అంటే నెలకు రూ.3 వేల నుంచి 4 వేలు మాత్రమే మిగిలినట్టు. ఇంత తక్కువ మిగిలితే రోజు కూలి ఏం పడినట్టని ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి వెళితే రోజుకు రూ.200ల నుంచి రూ.300లు కూలి వస్తున్నదని చెబుతున్నారు.



పెరిగింది గోరంతే...

తోట రమేశ్, రైతు, శివునిపల్లి

నాలుగేళ్ల క్రితం మద్దతు ధరలు కొంత మెరుగ్గానే పెరిగాయి. ప్రస్తుతం పంట పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈసారి పెరుగుదల అంతంతే ఉంది. ఏ మాత్రం గిట్టుబాటు కాదు. చేసిన కష్టం, పెట్టుబడి, నిర్వహణ ఖర్చులు అన్నీ చూసుకుంటే లాభం మాటేమోగాని రైతులే మిగిలేలా ఉంది.

పెరిగిన మద్దతు ధరల వివరాలు

వరి సాధారణ రకం క్వింటాల్‌కు గత ఏడాది రూ. 2183 కాగా ఈ ఏడాది రూ.2300కి పెరిగింది. అంటే క్వింటాల్‌కు రూ. 117 పెరుగుదల ఉంది.

పంట	2024	2023	పెరుగుదల
వరి (సాధారణ)	2300	2183	117
వరి (ఏ గ్రేడ్)	2320	2203	117
పెసలు	8682	8558	124
మినుములు	7400	7050	450
మొక్కజొన్న	2225	2090	135
కందులు	7550	7000	550
వేరుశనగ	6783	6377	406
పత్తి(పొట్టిపింజ)	7121	6620	501
పత్తి(పొడుగుపింజ)	7521	7020	501
పొద్దు తిరుగుడు	7280	6760	520
సోయాబీన్(పసుపు)	4892	4600	292
నువ్వులు	9267	8635	632
జొన్నలు(హైబ్రీడ్)	3371	3180	191
జొన్నలు(మల్దండి)	3421	3225	196
సజ్జలు	2625	2500	125
రాగులు	290	3846	444

వరికి కనీసం రూ.500లు పెంచాలి



సముద్రాల రాజు, రైతు, నమిలిగొండ

ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.500లు, పత్తికి రూ.1000లు పెంచితే రైతులకు కొంత లాభదాయకం. అలా కాకుండా ధాన్యానికి రూ.117, పత్తికి రూ. 501లు పెంచడం ప్రస్తుత పెట్టుబడికి ఏమాత్రం సరిపోదు. రైతుకు కనీసం కూలి రేటు కూడా పడకపోతే ఇక ఏం ఫలితం ఉంటుంది?

ఎద్దు పొడిచి గిరిజన రైతు మృతి



మృతి చెందిన రైతు బానోత్ శ్రీను

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : ఎద్దు పొడవడంతో గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా (ఎస్) శివారు బిచ్యాతండాలో అదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్యాతండాకు చెందిన బానోత్ శ్రీను (47) రెండు ఎద్లు ఉన్నాయి. వర్షం వస్తుండడంతో ఆరు బయట ఉన్న పశువులను కొట్టంలో కట్టేసేందుకు వాటిని తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎద్దు ఒక్కసారిగా శ్రీనును పొడవడంతో అతని తల ఇంటిగోడకు బలంగా తాకింది. దీంతో శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నానుకి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య నానుకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నారం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూలై 1: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం (సరస్వతీ) బ్యారేజీ వద్ద నిపుణుల బృందం చేపడుతున్న పరీక్షలు 11 రోజులక చేరాయి. ప్యార్లర్ సెర్చింగ్ మెథడ్‌లో ఈ టెస్టులు జరుగుతున్నాయి. మొత్తం 42 ప్రాంతాల్లో ఈ టెస్టులు చేయాల్సి ఉండగా సోమవారం నాటికి ఏడు ప్రాంతాల్లో వీటిని నిర్వహించారు.

ఎస్సీ గురుకులాల్లో పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్లకు దరఖాస్తు ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల్లో పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆర్‌సీవో ఎస్. విద్యారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్, సోషల్, బయోసైన్స్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూలై 3వ తేదీ లోపు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ ఎదురుగా ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 4వ తేదీన ఇంటర్వ్యూతో పాటు డెమో ఉంటుందని తెలిపారు.

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూ క్యాంపస్, జూలై 1 : జూలై 2, 4 తేదీల్లో జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను డివిజన్ కౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షల కారణంగా రీషెడ్యూల్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికా రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2న జరుగాల్సిన పరీక్ష జూలై 20న, జూలై 4న జరుగాల్సిన పరీక్ష జూలై 22న జరుగుతుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయం, పరీక్ష కేంద్రాల్లో ఏలాంటి మార్పులు ఉండవని పేర్కొన్నారు.

6 నుంచి ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఎగ్జామ్స్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ సీబీసీఎస్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు జూలై 6 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6, 9, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్‌లోని కామర్స్ విభాగం, ఎడ్యుకేషన్ విభాగం, హనుమకొండ వాగ్దేవి పీజీ కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఒకే ఈతలో ఏడు మేకల పిల్లలు



ఏడు పిల్లలకు జన్మనిచ్చిన మేక

మరిపెడ రూరల్, జూలై 1 : సహజంగా మేకలు, గొర్రెలు ఒకే ఈతలో 1, 2, లేదంటే మూడు పిల్లలు జన్మించడం సాధారణంగా చూస్తాం.. కానీ ఈ మేక గతంలో 3 పిల్లలకు జన్మనివ్వగా ఈ సారి ఏకంగా ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు రేఖ వెంకన్నకు చెందిన మేక ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. జన్మించిన ప్రతి పిల్ల ఆరోగ్యంగా ఉండడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇందులో నాలుగు పోతు పిల్లలు, మూడు కొదమలు ఉన్నట్లు రైతు తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కును సందర్శించిన 'యంగ్‌వన్' చైర్మన్



హెలిప్యాడ్ వద్ద టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌తో మాట్లాడుతున్న చైర్మన్ కిహాక్‌సంగ్

గీసుగొండ, జూలై 1: గీసుగొండ మండలం శాయంపేటహవేలి గ్రామశివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను దక్షిణకొరియా దేశానికి చెందిన యంగ్‌వన్ కంపెనీ చైర్మన్, సీఈవో కిహాక్‌సంగ్, కంపెనీ ప్రెసిడెంట్ మిన్‌సుక్‌లీ, డైరెక్టర్ ఎండీ షాజాహాన్ సోమవారం సందర్శించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లో అపాయింట్‌మెంట్ ఉన్న నేపథ్యంలో వారు తొలుత టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుని తమ కంపెనీ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుక వచ్చారని టీజీఐఐసీ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పార్కుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు స్థలం మ్యాప్‌ను పరిశీలించడంతో పాటు 3 గంటల పాటు వారు కంపెనీ నిర్మాణాలపై చర్చించారు. యంగ్‌వన్ కంపెనీకి పార్కులో వస్త్ర పరిశ్రమలను నెలకొల్పేందుకు 297 ఎకరాలను టీజీఐఐసీ కేటాయించగా రూ.980 కోట్ల అంచనా వ్యయంతో కొద్దినెలల క్రితం కంపెనీ నిర్మాణ పనులను చేపట్టింది. ఇందులో 12వేల మందికి ప్రత్యక్షంగా, మరో 10వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని టీజీఐఐసీ అధికారులు చెబుతున్నారు. వస్త్ర పరిశ్రమల రంగంలో యంగ్‌వన్ కంపెనీకి ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉందని, ఫామ్ టూ ఫ్యాషన్ పారిన్ అనే విధంగా ఇందులో వస్త్రాలు తయారు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధుల వెంట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రామా సంతోష్‌కుమార్, తదితరులున్నారు.

బాల్యంపై.. బ్యాగు భారం!



వరంగల్ జిల్లాలో 244 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 70,520 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం పలు పబ్లికేషన్స్ రూపొందించిన, తమ సంస్థల పేరిట ముద్రించిన పుస్తకాలను కొనాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో ఎల్‌కేజీ చదువుకునే విద్యార్థికి 6 నుంచి 10 పాఠ్య పుస్తకాలు, క్లాస్ వర్క్, హోమ్‌వర్క్ కోసమంటూ పదుల సంఖ్యలో నోట్ పుస్తకాలు ఇస్తున్నాయి. తల్లిదండ్రులు వాటిని బ్యాగుల్లో ఉంచి పిల్లలను బడికి పంపుతున్నారు. వీటికి లంచ్ బాక్స్, వాటర్ బాటిల్ తోడవడంతో బ్యాగు బరువు 4 నుంచి 6 కిలోల వరకు అవుతోంది. ఇలా తరగతి పెరిగే కొద్దీ బరువు పెరుగుతోంది. ఈ మోత భారంతో పిల్లలు చిన్నతనం నుంచే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- పుస్తకాల మోతతో విద్యార్థుల అవస్థలు
- ఏటేటా పెరుగుతున్న బరువు
- చిన్న వయస్సులోనే వెన్నెముక సమస్యలు
- అమలు కాని విద్యాహక్కు చట్టం నిబంధనలు
- అవగాహన కల్పించని అధికారులు

వర్ధన్నపేట రూరల్, జూలై 1 : పుస్తకాల బరువు బాల్యాన్ని కుంగదీస్తోంది. కిలోలకు కిలోల బరువుంటున్న పుస్తకాల బ్యాగులతో చిన్నారుల వెన్నెముక వంగిపోతోంది. ప్రైవేటు పాఠశాలల పుణ్యమా.. అని ఒకటి, రెండు తరగతుల విద్యార్థులే 20 నుంచి 25కిలోల పుస్తకాలను మోస్తున్నారు. వాస్తవానికి విద్యార్థి బరువులో 10 శాతం మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని చెబుతున్న విద్యాహక్కు చట్టం.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని పేర్కొంటోంది. కానీ, ఈ నిబంధనలేవీ అమలవడం లేదు. అవసరం లేని పుస్తకాలను పాఠశాలలలోనే భద్రపరుచుకునేలా లాకర్ల సదుపాయం ఏర్పాటు చేయాలని ఉన్నా చాలా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలతో ప్రస్తుతం విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేలాడేలా వేసుకుంటున్నారు. దీని వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అవసరం లేని పుస్తకాలే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు సంబంధించిన ఆరు పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంటాయి. కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం అందుకు విరుద్ధంగా తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపేందుకు ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు 10 నుంచి 12 పుస్తకాలు, ఒక్కో సబ్జెక్టుకు తరగతి వర్క్‌బుక్, హోం వర్క్, ప్రాజెక్టు పని ఇలా మూడేసి పుస్తకాలు కొనుక్కోవాలని చెబుతున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మొత్తం 30 నుంచి 45 అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరం లేని పుస్తకాలను పక్కకు పెట్టి అవసరం ఉన్న వాటిని వాడుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

ఈసారైనా అవగాహన కల్పించేనా..?

విద్యాహక్కు చట్టంపై క్షేత్రస్థాయిలో అధికా రులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగా ణ ప్రభుత్వం అదే స్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రైవేటు పాఠశాలల్లో అమలవుతుందా.. లేదా చూసుకోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రు లు ప్రైవేటు యాజమాన్యాలను ప్రశ్నించేలా చట్టంపై అవగాహన తేవా లి. ఆయా మండలాల్లోని ఎంఈవోలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు కళాజాత మాదిరిగా, ప్రభుత్వ పాఠశాలల పనితీరు ను వివరించేటప్పుడు, విద్యా హక్కుపై గల సామాన్య ప్రజల హక్కును గుర్తుచేయాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.


అధిక భారం వెన్నుపూస పైనే..

నిటారుగా నిలబడాలంటే వెన్నుపూస ప్రధాన ఆధారం. పుస్తకాల బ్యాగును వీపుపై వేసుకోవడం వల్ల వెన్నెముకపై భారం పడుతోంది. దీంతో అది దెబ్బతినే ప్రమాదం ఉంది. 15ఏళ్ల పిల్లల శరీరంలో వివిధ రకాల మార్పులు సంభవిస్తాయి. ఈ వయస్సులో వెన్నెముకపై సామర్థ్యానికి మించి భారం వేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరి స్తున్నారు. వెన్నుముక, మెడ నొప్పులు వచ్చే ప్రమాదం ఉంద ని చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

అమలుకు నోచుకోని చట్టాలు..

ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు తగ్గించా లని ప్రభుత్వం 2006లోనే చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ, అది అమలుకు నోచుకోవ డం లేదు. విద్యార్థి శరీర బరువులో 10 శాతం మాత్రమే పాఠ్యపుస్తకాలు ఉండేలా ఆ చట్టం చెబుతోంది. విద్యార్థి సుమారు 14కిలోలు ఉన్నాడనుకుంటే ఆవిద్యార్థి తీసుకెళ్లే బ్యాగు మాత్రం 4 కిలోలు ఉంటుంది. దాన్ని మోసేందుకు విద్యార్థి అష్టక ష్టాలు పడాల్సిన పరిస్థితి. ప్రైవేటు పాఠశాలలు నాలుగైదు అంతస్థుల్లో ఇరుకిరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థులు పుస్తకాల బ్యాగులతో అన్ని అంతస్థులు ఎక్కాల్సిందే.

వెన్నుముకపై భారం పడుతుంది



డాక్టర్ సోమశేఖర్, ఎండీ సర్జన్

చిన్న వయసులోనే విద్యార్థులు అధిక పుస్తకాలు గల బ్యాగులు మోయడంతో బరువు నేరుగా వెన్నెముకపై పడుతుంది. ఎంతో సున్నితమైన ప్రదేశంలో మనకు తెలియకుండా రోజు రోజుకు భారం పెరగడంతో ఒక్కసారిగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బోధన విధానం, చదువుకునే తీరు కూడా సమయాన్ని బట్టి అనుసరించాలి. ఆడుకునే సమయంలో ఆడుకోకుండా చదవడమే చేస్తే మానసికంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారు.

పిల్లలపై ఒత్తిడి తగ్గించాలి



గాండ్ల కుమార్, వర్ధన్నపేట

పిల్లలపై పుస్తకాల బరువుతో పాటు మానసికంగా కూడా పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. చిన్న వయసులో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు పేజీల కొద్ది పుస్తకాలు తిరగేస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైంది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రైవేటు పాఠశాలలపై ఎల్లప్పుడు నిఘా పెంచితే వారి ఆగడాలను అరికట్టవచ్చు.

లంబాడా భాషను జాతీయ భాషగా గుర్తించాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీర స్వామి నాయక్

జిల్లాలో ఘనంగా పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం



జనగామలో జెండా ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీస్ నాయకులు

జనగామ రూరల్, జూలై 1: గోరు బోలి లంబాడీల భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చి జాతీయ భాషగా గుర్తించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీర స్వామి నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఎల్‌హెచ్‌పీస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సమితి జెండాను ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే గోరు బంజార జాతీయ సమ్మేళనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్వామి నాయక్ మాట్లాడుతూ దేశంలోని 15 రాష్ట్రాల్లో 20 కోట్ల మంది బంజారులు ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం లంబాడీ భాషను జాతీయ భాషగా గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, నాయకులు బానోత్ భిక్షపతి, భూక్య జయరాం, అజ్మీర మంగమ్మ, కొర్ర రాజేందర్, లకావత్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత కారుకు నిప్పు

అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య

జనగామ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జనగామకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ నాయకుడు ఎర్రమల్ల సుధాకర్ కారుకు ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఇంటి ముందు పార్కు చేసిన కారు వెనుక భాగంలో నిప్పు అంటించడంతో సగానికి పైగా కాలిపోయింది. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారుకు నిప్పు అంటించి తగలబెట్టే ప్రయత్నం చేశారు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు తెలుస్తోంది. కారు మంటల్లో కాలుతుండడంతో గమనించిన స్థానికులు సుధాకర్‌ను నిద్రలేపారు. ఆయన బయటకు వచ్చి వారి సాయంతో మంటలను ఆర్పారు. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకోగా సోమవారం ఉదయం సీఐ రఘుపతిరెడ్డి పరిశీలించారు. కాగా.. తన కారును మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డే తగలబెట్టించారంటూ సుధాకర్ ఆరోపించారు. రాజకీయంగా తనపై కక్ష పెంచుకుని ఈ విధంగా చేయించారని అన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడినట్లు నిర్ధారించామని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణిమల్లారెడ్డి హితవు పలికారు. జిల్లాకేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎర్రమల్ల సుధాకర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొమ్మూరికి వ్యతిరేకంగా పనిచేశారని అన్నారు. ఈ విషయంలో పార్టీ అధిష్టానం షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. తన కారుకు కొమ్మూరే నిప్పు పెట్టించారని ఆరోపించడం సరైంది కాదన్నారు. ఇలాంటి ఆరోపణలు ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

నర్మెట, జూలై 1: మండలంలోని అమ్మాపురం తుర్కానికుంట సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. అమ్మాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ సోమవారం సాయంత్రం నర్మెట వైపు వస్తుండగా, వల్లంపట్ల గ్రామానికి చెందిన రవి అతడి భార్య భాగ్య, వారి పిల్లలు ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో రవి, అతని భార్య భాగ్యతో పాటు శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. వారిని నర్మెటలో ప్రథమ చికిత్స అనంతరం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో రవి, భాగ్య అపస్మారక స్థితికి వెళ్లినట్లు సమాచారం. పిల్లలకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

● వివిధ సమస్యలపై 90 అర్జీలు ఇచ్చిన ప్రజలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కవులు, కళాకారులు

జనగామ రూరల్, జూలై 1: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ ప్రజల వద్ద నుంచి మొత్తం 90 అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి అన్ని మండలాల తహసీల్దార్‌లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీఎస్‌వో రోజారాణి, డీడబ్ల్యూవో జయంతి పాల్గొన్నారు.

చేపలకు బదులు సొసైటీలకు నగదు జమ చేయాలి

మత్స్యకారులకు చేపలకు బదులు సొసైటీలకు నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారుల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం మత్స్య కార్మిక సంఘం నాయకులు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 2024-2025 ప్రత్యేక బడ్జెట్‌లో 200 కోట్లు కేటాయించి మత్స్యకారులకు చేపలకు బదులు సొసైటీలకు నగదు జమ చేయాలని, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం మంత్రిని నియమించాలని, వచ్చే బడ్జెట్‌లో 5000 కోట్లు నిధులు కేటాయించాలని, మత్స్య కార్మికుడు మరణిస్తే పది లక్షలు రూపాయలు, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

జనగామలో ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించాలి

జనగామ కల్చరల్: జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట మైదానంలో ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించాలని కవులు కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కళావేదిక నిర్మాణం కోసం 25 కళా సాహిత్య సంస్థలు మద్దతు ప్రకటించాయన్నారు. ఈ విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వారిలో కవులు కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ జి.కృష్ణ, అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, మాన్యపు భుజేందర్, చీటూరు నర్సింహులు, కొదిరిపాక ఆనంద్‌కుమార్, కన్నారపు శివశంకర్, చిలుమోజు సాయికిరణ్, గుగ్గిళ్ల నర్సయ్య, చిలుమోజు దక్షిణామూర్తి, పెట్లోజు సోమేశ్వరాచారి, వేముల సదానందం, పొట్టబత్తిని భాస్కర్, గడ్డం మనోజ్‌కుమార్ గౌడ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నిలిపివేయాలి

చిలుపూర్: మండలంలోని కృష్ణాజీగూడెంలో చేపడుతున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి, అట్టి స్థలాన్ని మహిళా కమ్యూనిటీ హాల్‌కు కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కోరిపెల్లి రాజహంస, కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు సాదం రాజేందర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సాదం భీమన్న, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు సాదం మచ్చ మల్లేష్ మాట్లాడుతూ 2009లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు నేతృత్వంలో హెల్త్ సెంటర్‌తో పాటు, మహిళా సంఘం భవనాల కోసం ఇందిరమ్మ కాలనీలో 80 గజాల చొప్పున మొత్తం 8 ప్లాట్లను కేటాయించారని గుర్తు చేశారు. ఇందులో ఇప్పటికే హెల్త్ సెంటర్ నిర్మించారని, ఇక మహిళా సంఘం భవనానికి కేటాయించిన స్థలంలో కొందరు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టారని వాపోయారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు.

పింఛన్ మంజూరు చేయాలి: ఏదునూరి రాజమణి, నర్మెట



మా కూతురు ఏదునూరి తేజస్వి వయస్సు 9 సంవత్సరాలు ఉంటుంది. పుట్టుకతోనే అంగవైకల్యంతో జన్మించింది. అనేక మార్లు సదరం క్యాంపులో పాల్గొన్నాం. పరీక్షలు నిర్వహించి వైద్యులు ఒకసారి 100 శాతం అంగవైకల్యమని, మరోసారి 90 శాతం అని సర్టిఫికెట్ ఇచ్చారు. అయిన కూడా మ పాపకు పింఛన్ రావడం లేదు. విచారణ జరిపి పింఛన్ మంజూరు చేయాలి.

ఐటీఐ కళాశాల మంజూరు చేయాలి: బిర్రు ఇస్తారి, ఎల్లంల



జనగామలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల నిర్మించేందుకు 2017లో అప్పటి కలెక్టర్ దేవసేన చంపక్‌హిల్స్‌లో సర్వేనంబర్ 140/1లో ఐదు ఎకరాల స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాని ఇంతవరకు జనగామలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల నిర్మించడం లేదు. ఈ విషయంలో ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ చూపాలి.

సాగు భూములకే

రైతు భరోసా ఇవ్వాలి

అభిప్రాయ సేకరణలో వెల్లడించిన రైతులు



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న డీసీవో రాజేందర్‌రెడ్డి

బచ్చన్నపేట, జూలై 1: సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలని, దానికి 10 ఎకరాల పరిమితి విధించాలని రైతులు వెల్లడించారు. సోమవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వివిధ గ్రామాల నుంచి హాజరైన రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. 114 మంది రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, కౌలు రైతుల విషయంలో స్పందించటానికి అంతగా ఆసక్తి చూపలేదు. రియల్ వ్యాపారుల భూములకు ఎట్టి పరిస్థితుల్లో రైతు భరోసా ఇవ్వరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి కృష్ణంరాజు, వైస్ ఎంపీపీ అనిల్‌రెడ్డి, ఏవో విద్యాకర్‌రెడ్డి, సీఈవో బాలస్వామి, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, నిడిగొండ శ్రీనివాస్, గడిపె ప్రభాకర్, వేముల లక్ష్మణ్‌గౌడ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఐదెకరాల పరిమితి విధించాలి..

జనగామ రూరల్: ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సహాయం(రైతు భరోసా)పై మండలంలోని చీటకోడూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో జనగామ పెంబర్తి రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి బి.వినోద్ కుమార్ రైతుల సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. గత ప్రభుత్వం చెట్లు, గుట్టలు ఉన్నా కూడా రైతుబంధు డబ్బులు ఇచ్చేవారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు నిమ్మతి మహేందర్‌రెడ్డి, చిర్ర శ్రీనివాస్ రెడ్డి సీఈవోలు బాస్కర్‌రెడ్డి, రాంమెహన్ పాల్గొన్నారు.

నర్మెట: ఐదు ఎకరాల లోపు సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలని పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, మండల రైతులు అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని రైతు వేదికలో రైతు భరోసాపై అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. గుట్టలు, రోడ్లు, ప్లాట్లు, చెరువుల, కుంటలు, రియల్ ఎస్టేట్ భూములకు ఇవ్వొద్దన్నారు. గ్రామాల్లో భూములను సాగు చేసే రైతులను గుర్తించి ఐదు ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూములు, ఆస్తులు ఎక్కువ ఉన్న రైతులు స్వచ్ఛందంగా రైతు భరోసాను వదులు కోవాలన్నారు. తాను కూడా రైతు భరోసాను వదులుకుంటానని తెలిపారు. రైతుభరోసా వచ్చినా తిరిగి ప్రభుత్వానికే ఇచ్చేస్తానన్నారు. రైతులు సూచించిన సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీవో రాజేందర్ రెడ్డి, ఏవో డి. సంతోషి, సీఈవో కొన్నె వెంకటయ్య, డైరక్టర్లు నాగపూరి కిషన్, రైతులు, సిబ్బంది ప్రజ్ఞాపురం మల్లయ్య, శివ, కేశవులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు జన్మనిస్తే.. డాక్టర్లు పునర్జన్మనిస్తారు

డాక్టర్స్‌డే వేడుకల్లో కొనియాడిన వక్తలు



ఘన్‌పూర్ పీహెచ్‌సీలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 1: తల్లిదండ్రులు జన్మ ఇస్తే, ఆపద సమయంలో ప్రాణాలు కాపాడి వైద్యులు పునర్జన్మ ఇస్తారని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్‌రాజు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ ఆసుపత్రిలో సేవలు అందిస్తున్న 14 మంది వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డాక్టర్ బీసీ రాయ్ జయంతి సందర్భంగా డాక్టర్స్‌డే నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు విజయ్‌చందర్, ఎం.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశం, ఎ.మధు, గట్టు రమేష్, గోలి శ్రీను, డాక్టర్ వీ రాంజనేయులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ డాక్టర్స్‌డేను పురస్కరించుకొని డివిజన్ కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులను మహిళ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. వైద్యులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా మహిళ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వడ్లూరి మౌనిక మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే ప్రత్యక్ష దైవాలు డాక్టర్లు అని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా నాయకులు దార పద్మ, నాగమణి, స్రవంతి, నిరోష, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు షేక్‌జానీ, కుందూరు శ్రీనివాస్ రెడ్డి, సింగపురం ప్రతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ కల్చరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి డాక్టర్ మాచర్ల భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో డాక్టర్ వృత్తికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.అనిల్‌బాబు, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మధు, సుమంత్, లక్ష్మయ్య, సోమేశ్వరాచారి, నాజియా సుల్తానా, పావని, సల్మాన్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భిక్షపతిని సన్మానించారు.

సభ్యుల సహకారంతోనే అభివృద్ధి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత

చిలుపూర్, జూలై 1: ఎంపీటీసీ సభ్యుల సహకారంతోనే ఆయా గ్రామాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు అన్నారు. సోమవారం ఐదేళ్ల కాలానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, కేటాయించిన నిధులకు సంబంధించి వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తమ పాలకవర్గం హయాంలో ఇప్పటివరకు రూ 1. 52 కోట్ల మండల పరిషత్తు నిధులతో ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, ఒక్కో ఎంపీటీసీకి రూ.8 లక్షల నిధులను కేటాయించామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఇతర నాయకుల సహకారంతో మరింతగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలో తమ పదవీకాలం ముగుస్తుందని, ఇప్పటివరకు సహకరించిన అధికారులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణ, ఎంపీటీసీలు పాశం శిరీష -సురేశ్, తాళ్లపల్లి ఉమ -సమ్మయ్య, ఎన్నకూస కుమార్, సాదం నర్సింహులు, కంకటి రవిందర్, మునిపెల్లి సుధాకర్, నాయకులు మారబోయిన ఎల్లయ్య, భూక్య నరసింహ పాల్గొన్నారు.

మండల అభివృద్ధి మా బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల జూలై 1 : మండల అభివృద్ధి తమ బాధ్యత అని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో సోమవారం మండల అభివృద్ధి పనులు, సమస్యలపై మండల పార్టీ అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్ అధ్యక్షతన సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత లింక్ రోడ్లు, డ్రైనేజీలు, నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్స్, విద్యుత్ సరఫరా, పెన్షన్, సీఎం రిలీఫ్‌ఫండ్‌లు తమ దృష్టికి వచ్చాయని, త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న క్రీడాప్రాంగణాలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మెరుగైన విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సోమనర్సయ్య, మసురం రవీందర్, ఎన్.వెంగళరావు, శ్రీవర్ధ, ధర్మారం భిక్షపతి, ప్రసాద్, పసునూరి మధుసూదన్, డి.నాగరాజు, బత్తుల వెంకన్న, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'విరివిగా మొక్కలు నాటాలి'

రఘునాథపల్లి, జూలై 1: పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటాలని లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ నూతన అధ్యక్షుడు కందుల అనిల్‌కుమార్ అన్నారు. నూతన కమిటీ బాధ్యతలు చేపట్టిన మొదటి రోజయిన సోమవారం కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని దుర్గమాతా ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ కూరెళ్ల పెద్దఉపేందర్, గంగ్ర శ్రీకాంత్, క్లబ్ ప్రధాన కార్యదర్శి కర్మికొండ ప్రదీప్ కుమార్, కోశాధికారి కోళ్ల రాజు, శంకర్ రెడ్డి, వాయినాల సురేష్, రంగోజు ఈశ్వరయ్య, రహీం పాష, లక్ష్మినారయణ, ఇమ్మడిశెట్టి కరుణాకర్ పాల్గొన్నారు.

'తమ్మడపల్లి(జి)కి బస్సు నడపాలి'

జఫర్‌గడ్, జూలై 1 : మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామానికి జిల్లా కేంద్రం నుంచి బస్సు సర్వీసును నడిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండి.షబానా మాట్లాడుతూ గ్రామం నుంచి జిల్లా, మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. జనగామ నుంచి పాలకుర్తి, జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి) మీదుగా జఫర్‌గడ్ మండల కేంద్రం నుంచి వరంగల్‌కు, అలాగే హన్మకొండ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, తీగారం, సూరారం, తమ్మడపల్లి(జి) మీదుగా జఫర్‌గడ్‌కు బస్సు సర్వీసులను నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు రాపర్తి రజిత, పిచ్చమ్మ, యాదమ్మ, చొప్పరి వెంకటమ్మ, నక్క అనూష, సూదగాని మాధవి, కసరబోయిన కేతమ్మ, కొంతం ఉప్పమ్మ పాల్గొన్నారు.

నేడు జఫర్‌గడ్‌లో రైతు సమావేశం

జఫర్‌గడ్, జూలై 1 : జఫర్‌గడ్‌లోని రైతు వేదిక భవనంలో మంగళవారం మండల రైతులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ) కీర్తిస్నేహ, అనిత, శిరీష తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో ప్రభుత్వం అమలు చేసే రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అధికారులు తగు సలహాలు, సూచనలు, అభిప్రాయాలను స్వీకరిస్తారన్నారు. కావున మండలంలోని ఆయా గ్రామాల రైతులు మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

'సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తాం'

పాలకుర్తి, జూలై 1: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని కొండాపురంలో వారు మాట్లాడారు. గ్రామంలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరి చేసేలా కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో ఎర్రబెల్లి రాఘవరావు, గడ్డం యాకసోమయ్య, ఎస్సీ సెల్ జల్గం కుమారస్వామి, మంగ అంజయ్య, బాబు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

కొడకండ్ల జూలై 1: మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వాటర్ ప్లాంట్ పనిచేయక విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలిసిన 1991-92 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ముందుకు వచ్చి ఈ విద్యా సంవత్సరానికి సరిపడా మినరల్ వాటర్ ఖర్చులను తాము భరిస్తామని తెలిపారు. ఈ మేరకు సోమవారం మినరల్ వాటర్ క్యాన్లను పాఠశాలకు అందజేసి హెచ్‌ఎం గ్రేస్ కేజియారాణితో ప్రారంభింపజేశారు. అనంతరం పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన ఎస్.రేణేశ్వరికి రూ.5 వేలు, ఎంపీటీసీ అందె యాకయ్య మరో రూ.2 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాము లక్ష్మీనారాయణ, సైదమ్మ, గుండా పూర్ణచందర్, విష్ణువర్ధన్, ఉమారాణి, వెంకన్న, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పట్టా చేశారని ఆందోళన

లింగాలఘణపురం, జూలై1: తన తండ్రికి సంబంధించిన భూమిని సోదరుడు భూపాల్‌రెడ్డికి అక్రమంగా పట్టాచేశారంటూ సోమవారం లింగాలఘణపుం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోరెడ్డి ఎలేందర్‌రెడ్డి ఆందోళనకు దిగారు. తన తండ్రి యాదవరెడ్డి పేరిట లింగాలఘణపురం రెవిన్యూ గ్రామ పరిధిలో 1.05 ఎకరాల వ్యవసాయభూమి ఉండగా 2011లో చనిపోయాడని తెలిపారు. ఆతర్వాత సదరు భూమి ఇద్దరు కొడుకులకు సమానంగా వర్తించాల్సి ఉండగా తన సంతకాన్ని సోదరుడు భూపాల్‌రెడ్డి ఫోర్జరీ చేసి 2019లో అక్రమంగా ఒక్కడికే పట్టాచేయించుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంలో అధికారులు తనకు అన్యాయం చేశారని తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

ఆర్థిక సమస్యలతో ఎంపీటీసీ ఆత్మహత్య



బండ లక్ష్మి (ఫైల్)

జనగామ రూరల్, జూలై1: జనగామ మండలం ఎల్లంల ఎంపీటీసీ బండ లక్ష్మి(47) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. కొంత కాలంగా ఆమె ఆర్థిక, మాకసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఈక్రమంలో జూన్ 30న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. కుటుంబసభ్యులు వెంటనే జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. కాగా, సోదరి ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తమ్ముడు సోమవారం జనగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాపీ మేస్త్రీకి తీవ్రగాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 1: మండలంలోని పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డివిజన్ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎడ్ల జాను అనే తాపీ మేస్త్రీ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం చిలుపూరు మండలం చిన్నపెండ్యాల గ్రామానికి వెళ్లి మోపెడ్‌పై తిరిగి వస్తున్న క్రమంలో పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద దేశాయి తండా నుంచి ఘన్‌పూర్‌కు వెళ్లుతున్న బైక్ ఢీకొట్టింది. దీంతో జాను కిందపడగా తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు వెంటనే అతడిని 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సీఐ ముస్కు రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు దుకాణంలో చోరీ

పాలకుర్తి, జూన్ 1 : మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా సమీపంలో రజనీకర్ జ్యూవెలర్స్ దుకాణంలో సోమవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పాలకుర్తిలో సంత కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. బంగారం దుకాణంలోకి నలుగురు మహిళలు ఆభరణాలు కొనుగోలు చేయడానికి వచ్చి రెండు, మూడు వస్తువులను దొంగిలించి ఏ వస్తువులు కొనుగోలు చేయకుండా అక్కడి నుంచి పరారయ్యారు. షాపు యజమానికి అనుమానం వచ్చి సీసీ పుటేజీని పరిశీలించగా మహిళలు చోరీకి పాల్పడింది నిజమేనని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిప్రసన్నకుమార్ తెలిపారు.

రాణునాయక్ జీవితం ఆదర్శం

కొడకండ్ల జూలై 1: తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోత్ రాణునాయక్ జీవితం అందరికీ ఆదర్శమని, బంజారా జాతికి గర్వకారణమని గిరిజన నాయకులు అన్నారు. మండలంలోని గిర్నీతండా క్రాస్‌రోడ్డులోని రాణునాయక్ విగ్రహం వద్ద 108వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. కార్యక్రమంలో హేమానీ, ధూమా, గోవింద్, కిషన్, హరిచందర్, సోమన్న, రవి, సూరజ్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి: టీపీటీఎఫ్

జనగామ కల్చరల్, జులై 1: పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసే క్రమంలో చేపట్టిన కౌన్సిలింగ్‌లో అనధికార హేతుబద్ధీకరణ నిలిపివేసి బదిలీలు, నియామకాల ద్వారా పోస్టులు భర్తీ చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మూతపడిన ప్రతి పాఠశాలను తెరిపించి బడులు నడుపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగంగా ఇచ్చిన హామీకి భిన్నంగా విద్యాశాఖ అధికారులు అనధికార హేతుబద్ధీకరణ చేస్తూ ఉపాధ్యాయ పోస్టులు దాచి ఉంచడం సరికాదన్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్రలో భాగమేనన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ కౌన్సిలింగ్‌లో జిల్లా విద్యాధికారులు నిన్నటి వరకు ప్రదర్శించిన ఖాళీల జాబితాలో మొత్తం ఖాళీలు, బదిలీల కౌన్సిలింగ్ సమయంలో చూపించకుండా అనధికార రేషనలైజేషన్‌ను అమలు చేస్తూ సీఎం ఇచ్చిన హామీకి తూట్లు పొడుస్తున్నారని, తద్వారా బడుల మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం ఇచ్చిన హామీని పరిగణనలోకి తీసుకొని అన్ని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ప్రాథమిక స్థాయిలో తరగతికి ఒక ఉపాధ్యాయుని చొప్పున ఉన్నప్పుడే విద్యావ్యవస్థ బలోపేతమవుతుందన్నారు. అందుకు అనుగుణంగా స్టాఫ్ ప్యాటర్న్ రూపొందించి, అన్ని ఖాళీలు బదిలీలు, డీఎస్సీ నియామకాల సమయంలో చూపాలని, బదిలీలలో జరిగిన అవకతవకలు సరి చేయాలని డిమాండ్ చేశారు.